


# ఇక్కడ అంతా క్షేమం

చాలా రోజులికి—

జోగారావుకి వుత్తరం రాయాలన్పించింది. అన్పించి - ఆఖరు వాడి ఎక్సర్ సైజు పుస్తకాన్ని తీసుకుని తీరిగ్గా కూర్చున్నాడు. క్షణం ఆలోచించి, వొద్దికగా చిన్న చిన్న అక్షరాలతో మొదలు పెట్టాడు.

"ఇక్కడ అంతా క్షేమం."

—అని రాసి ఫుల్‌స్టాప్ పెట్టాడు. ఇంతలో సన్నగా గొణుక్కుంటున్నట్టు ఏడుస్తున్న రాజ్యం గొంతు విన్పించింది. అటువైపు-గది గుమ్మం దగ్గర శోకదేవతలా

కూర్చుని, కురుస్తున్న వర్షాన్ని, సందులోకి మలుపు తిరిగిన రోడ్డుని చూస్తోన్న భార్యను చూపి ఆమె తల్లి మనసుకు అతను చలించి పోయాడు. నిమిషం రాజ్యాన్ని తేరిపారి చూశాడు.

సన్నగా, కట్టెపుల్లల బొమ్మలా వుంది రాజ్యం. జుత్తంతా వూడి పోగా, మిగిలినది ముడిపెట్టుకుంది. తలుపుకి చేరగిలబడి, చేతుల్ని గుండె మీద చేర్చుకుని రోదిస్తోంది.

అతనికది మామూలే అన్పించింది. రాజ్యం ప్రవర్తన ఈ స్థితిలో అలాగే వుంటుంది-అని సరి పెట్టుకున్నాడు. తిరిగి వుత్తరమ్మీద వాక్యాన్ని చదువుకున్నాడు.

"ఇక్కడ అంతా క్షేమం."

అతని బాల్యమిత్రుడు, ప్రాణ స్నేహితుడూ అయిన సీతాపతి ఇప్పుడు హైదరాబాదులో వుంటున్నాడు. వాడి క్షేమాన్ని తెలియజేస్తూ కొద్ది రోజుల క్రితమే అతనికో వుత్తరం వచ్చింది. వుత్తరం వుత్తరమంతా సంతోషాలతోనూ, సంబరాలతోనూ నింపాడు. దాన్ని చదువుకుని, 'సీతాపతి అదృష్టవంతుడు' అనుకున్నాడు. పోనీ యిద్దర్లో ఒకడేనా సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు అని తృప్తిపడ్డాడు.

## పిటీకథ

ఎప్పుడో ఎనిమిదో తరగతి చదువుతూ ఏర్పరచుకున్న స్నేహం వాళ్ళది. అప్పట్లో సీతాపతి వాళ్ళ నాన్న చనిపోతే వాడు వాళ్ళమ్మతో హైదరాబాద్‌లో వున్న వాళ్ళ బాబాయి యింటికి తరలి వెళ్ళి పోయాడు. అప్పట్నుంచీ వాళ్ళిద్దరిదీ వుత్తి వుత్తరాల బంధం అయిపోయింది.

వుత్తరాలతోనే యిద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయని తెలుసుకున్నారు. ఆ వుత్తరాలతోనే యిద్దరూ తండ్రులయ్యారని తెలుసుకుని తెగ మురిసిపోయారు. వుత్తరాలు రాస్తూనే యిద్దరూ నలభైయ్యోపడిలో పడ్డారని వయస్సులను జ్ఞాపకం చేసుకున్నారు. అయితే నలభైయ్యోపడిలో పడ్డ జోగారావు సీతాపతి ఒకర్నొకరు పోల్చుకోలేనంతగా మారిపోయారు. కాని, ఆ విషయం వాళ్ళకి తెలియదు.

ఎవరికెవరు వుత్తరం రాసినా, అందులో చిన్ననాటి అనుభూతుల్ని పదే పదే చిత్రీకరించుకుంటారు,

అందాల్ని చెప్పిస్తూ వుంటారు. జీవితం అంటే మల్లెల తోరణం అంటూ రాస్తూ వుంటారు. బాధల్ని, భయాల్ని చాల తేలిగ్గా తీసుకోవాలనిధైర్యంచెప్పుకొంటూ వుంటారు. తన వుత్తరం చదివే అయిదు నిముషాల- అవతలివాడు ఈర్ష్యపడాలని, ఈర్ష్యపడి బాగు పడాలని వాళ్ళకోరిక.

అందుకే—

ఒకరి వుత్తరం ఒకరికి ప్రాణం వాళ్ళకి.

జోగారావు మరో వాక్యం రాశాడు.

"అక్కడ మీరంతా క్షేమమని తలుస్తాను."

అరవై అయిదు రూపాయల కోమటి గుమస్తా జీతగాడు జోగా రావంటే ఏమీకాడు. మామూలు మనిషి అసలేకాడు. ఎవరూ ఆతని స్నేహాన్ని కోరరు. (ఏ ఒక్కరో తప్ప) కాని, అతని సహాయం కోరతారు. అతన్ని లోకం ఏమీ కాదని గుర్తించకపోయినా, అతని భార్య అతన్ని 'భర్త' అని గుర్తించింది. అతని ముగ్గురు పిల్లలూ అతన్ని 'తండ్రి' అని గుర్తించారు. దానికే సంతృప్తి చెంది 'అంతే చాలు' అనుకుం టాడు జోగారావు.

—వుత్తరం రాస్తున్నాడు.

"ఒరే సీతాపతీ, చాలరోజు లైంది కదూ! నేను వుత్తరం రాసి? క్షమించు. ఈ మధ్య కొంచెం పని వొత్తిడివల్ల రాయలేక పోయాను. కాని, క్షణ క్షణం నీకు వుత్తరం రాయాలన్నదే నాకు జ్ఞాపకంగా వుంటోంది.

ఈ ఆర్నెల్లలో ఎన్ని సంఘ టనలు జరిగాయో తెలుసా? మన తెలుగు మాష్టారు- అతనేరా 'నళ్య భ్రాతకా' అని నిక్ నేమ్ పెట్టి పిలిచే వాళ్ళం, అతనికీ మధ్య టీ. బి.ఎటాక్తై చనిపోయారు.

కర్రిగుంట పారూలేదు! అది మొన్నీమధ్య వెయ్యి కొమ్మల చెట్టు దగ్గర కన్పించింది. దాని కిప్పుడు ఇద్దరు కొడుకులట. ఒకడు మిలటరీలోను, ఇంకొకడు నావీ లోను వుంటున్నార్ట! ఎంత ఇదిగా మారిపోయిం దనుకున్నావు! ముందుగా దాన్ని నేను పోల్చుకో లేకపోయాను. ఖరీదైన చీర, గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాలూ అదీను. లావయిపోయి అదేదో సినిమాలో సూర్యకాంతంకి మల్లే వుంది. కాకి నాడలో వుంటోందట! వీలైతే నన్నోసారి రమ్మంది. అలాగేనని నేను నవ్వుతుంటే, విచిత్రంగా నా వైపు చూసి 'ఏంవనిః' అడిగింది.

చెట్టును చూపించాను. పూగి పోతూ అదీ నవ్వింది. ఎందుకో తెలుసా? మనం పరీక్షలకు వెళ్తూ ఆ వెయ్యి కొమ్మల చెట్టుకు మొక్కేవాళ్ళం. దాని బెరడు లను బలవంతంగా పీకి జేబులో వేసుకునేవాళ్ళం. అలా వేసుకుని వెళ్తే- పరీక్షలు బాగా రాస్తామని నమ్మకం కదూ! కాని, దాని బెర డులు ఇన్ని జేబులో వేసుకుని, దాన్చుట్టూ పాతిక్కపైగా ప్రదక్షిణలు చేసినా జమిందారుగారి పెద్ద బ్బాయి....వాడేనా మొద్దబ్బాయి ఆఖరికి పాసవ్వ లేకపోయాడు. ఒక్కసారి వాణ్ణి వూహించుకో! గొప్ప నవ్వు వస్తుంది."

"తమ్ముడు ఇంకా రాలేదు. ఈ సరికి ఆఖరి ట్రయిను కూడ వచ్చే సుంటుంది. అయినా అది రాలేదు కామోసు." కీచుగా పక్కుతూ భర్తని కుదిపింది రాజ్యం.

"ఆఁ" అంటూ 'ఏవిటన్నట్టు' రాజ్యం కళ్ళల్లోనికి చూశాడతను.

"అమ్మాయిరాలేదు. వస్తే ఈ పాటికి వచ్చేవారేగా"

"అవును."

"అది రాదు. వాడు దాన్ని వదలడు. ఏం గలాటా జరిగిందో ఏమో?"

'ఏమో' అన్నట్టుగా జోగారావు కళ్ళార్చాడు. రాస్తూన్న వుత్తరాన్ని చదవడంలో విమగ్నుడైపోయాడు.

అతన్ని చూస్తూంటే రాజ్యానికి ఒక్కసారిగా చిరాకు, విసుగు, అసహ్యం, జాలి, ముంచుకొచ్చాయి. క్షణం మనిషిని విలువుగా పట్టుకుని— "ఏఁవిటి నువ్వు చేస్తోన్న నిర్వాకం?" అని కడిగేద్దా మనుకుంది. పుట్టి ఎలా పెరిగాడో మహాత్ముడు, పెళ్ళయిన తరువాత ఓ సంవత్సరం సరదాగా గడిపాడు.

---

## ఎ. ఎస్. జగన్నాథశర్మ

---

జీవితంలో తనకి పెళ్ళొద్దంటూ మొత్తుకున్నాట్ట. కాని తల్లిదండ్రులు మెడ వంచి చేశార్ట! సుఖపడ్డ ఆ ఒక్క సంవత్సరం-తగ్గ వుద్యోగం వుండేది. తర్వాత వూడిపోయి పరిస్థితి తారుమారైందట. ఎదుగుతున్న పిల్లలు, ఎదగని తన గుమాస్తా ఉద్యోగం. వాళ్ళ ఆకలి, వాపిరిగొట్టు మొగాలు- వాళ్ళ చదువులు, వాళ్ళ పెళ్ళిళ్ళు-అవే తల్చుకుంటూతనలోతనేదిక్కచచ్చి ఏడుస్తూ వుంట్టాట! —అని రాజ్యానికి అప్పుడప్పుడూ చెప్తూ కళ్ళంట నీళ్ళు పెట్టుకునే ఆ వ్యక్తిని చూస్తే ఆమెకు జాలి వేసింది. తర్వాత, బాధ్యతలేని మగడు, బ్రతుకుల్ని

పట్టించుకోని తండ్రి. అని అతన్ని గూర్చి బాధపడ్డది. వెళ్ళి—గదికి ఆ మూల కంచం, మంచినీళ్ళు అమర్చి భోజనానికి ఆతన్ని పిలిచింది. అతను విన్పించుకుని రానని అక్కడే కూర్చున్నాడు.

"బాగుందండీ! జరిగింది తెలుసుకుంటుంటే ఏవీ సహించవ్! లెండి కాస్త ఎంగిలిపడితే సరి" అంటూ కసిరింది అతన్ని.

"రానంటుంటే?" కోపించాడు అతను.

ఈ మధ్య జోగారావుకి 'ఉ' అంటే చాలు కోపం వస్తోంది.

అవును మరి!

కన్న కూతుర్ని పెంచి, పెద్ద చేసి ఇరవై యేళ్ళ దాన్నిగా చేస్తే, తనకి పెళ్ళి చేయలేదన్న అక్కసుతో-తండ్రి అసమర్థతను వేలెత్తి చూపుతూ అది ఎవడితోనో అక్రమ సంబంధం పెట్టుకుని లేచిపోతే, ఏ తండ్రి మెదడు మొద్దుబారిపోదు? ఏ తల్లి మనసు కృంగి కృశించిపోదు?

వుత్తరాన్ని చివరంటా చదువుకుని, ఆగిన చోటునుంచి మళ్ళీ ప్రారంభించాడు జోగారావు.

"చూశావా సీతాపతి! అటువంటి మొద్దబ్బాయి ఇప్పుడు పెద్ద ఇంజనీరు. మన ప్రక్క వూళ్ళోనే ప్రాజెక్టు వర్కులో వుంటున్నాడు. అప్పుడప్పుడూ నన్ను పలకరిస్తూ వుంటాడు.

విచిత్రం! కాలం దొర్లిపోయి మనం వేగంగా ఎంతెంత వాళ్ళం అయిపోయాం. ఉద్యోగస్తులం, భర్తలం, తండ్రులం. దేవుడు చల్లగా దయచూస్తే ఇంకొంత కాలానికి తాతలం కూడాను. అవునా!?

అవి మనవాళ్ళ సంగతులు.

ఇక యింటి సంగతులు—

మీ చెల్లెలు రాజ్యం కులాసాగా వుంది. పెద్దమ్మాయి రేణుకి పెళ్ళీడు వచ్చింది. తగిన సంబంధం చూసి దాన్ని ఓ ఇంటిదాన్ని చేస్తే...."

ఆ సంగతి రాస్తూ జోగారావు గుడ్లలో నీళ్ళు కుక్కుకున్నాడు.

అబద్ధానికి 'బాధ్యత' అనే ఓ అందమైన మలామా పూయలేని బలహీనుడు జోగారావు. అందుకే ఎప్పుడూ నిండుగా ఏడ్చుకుంటూ వుంటాడు. అతనికి రేణు చేష్టలు గుర్తుకొచ్చాయి.

నాలుగైదు రోజులక్రితం అతనికో వుత్తరం వచ్చింది. రేణు రాసింది—తను ఫలానా వూళ్ళో వుంటున్నట్టు, ప్రియుడుతో వేగలేక చస్తున్నట్టూను. చేసిన తప్పును క్షమించమంది. తనని ఆ నరకం

నుంచి విడుదలచెయ్యమని తండ్రిని వేడుకుంది. కూతురి విషయం తెలుసుకుని రాజ్యం విలవిల్లాడింది. భర్తని వెళ్ళమని ప్రాధేయపడ్డది. అతను వెళ్ళనని మొరాయించాడు. 'అదక్కడే చావనీ' అంటూ శపించినట్టుగా కేకవేశాడు.

తర్వాత కన్న పేగుకి లొంగి పోయి తనింట్లోనే వుంటూన్న బావమరిదిని పంపించాడు కూతురి దగ్గరకి. దాన్ని గురించే రాజ్యం కంగారుపడుతున్నది, చీమచిటుక్కు మంటే వీధివైపు చూస్తున్నదీను. తమ్ముడు ఏ ఫలితం చేతబట్టుకు వస్తాడోనని భయపడుతూందామె.

జోగారావు చేతి మడమలు కన్నీళ్ళను తుడుచుకున్నాడు. రాస్తు న్నాడు.

"మీ చెల్లెలు రాజ్యం కులా సాగా వుంది. పెద్దమ్మాయి రేణుకి పెళ్ళీడు వచ్చింది. తగిన సంబంధం చూపి దాన్ని ఓ ఇంటిదాన్ని చేస్తే నా బాధ్యత తీరిపోయినట్టే. అమ్మా యిని మంచి గవర్నమెంటు ఉద్యోగికి ఇద్దామని ఆశగా వుంది. రెండోవాడు బి. ఏ. చదివాడు. వాడికి వుద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాం. వుద్యోగం తప్పకుండా వస్తుందని నమ్మకంగా వుంది కారణం వాడు కాలేజీ ఫస్టు. చదు వుని తప్పక గుర్తిస్తుంది ప్రభుత్వం.

ఆఖరువాడు శంకరం ఫస్టు ఫారమ్ చదువుతున్నాడు. మంచి ఇంటలిజెంట్. పిల్లవాడు సన్నగా, చురుగ్గా నీలాగే వుంటాడు.

సంసారం ఇప్పటివరకూ నిండు కుండలా తొణక్కుండా వుంది. పదిమందీ మీ చెల్లెల్ని 'మా దొడ్డ ఇల్లాలు' అని చెప్పుకుంటున్నారు. నన్నా సరేసరి! గొప్ప కాదులా! నిజం! ఒట్టు సుమీ....!"

శంకరం తిట్లు ఇల్లంతా ప్రతి ధ్వనించే సరికి తిరిగి చూశాడు జోగారావు, ఆఖరివాడ్ని బావమరిది చావ చితక్కొడుతున్నాడు. రాజ్యం తమ్ముడ్ని అడ్డుకుంటూంది.

ఏం జరిగింది? ఏం జరిగింది?? అనేమీ సంక్షోభం చెందలేదు జోగారావు. నిలబడి చూస్తున్నాడు. బావమరిదే కలుగజేసుకొని చెప్తు న్నాడు.

"వెధవ! వెధవ పనీ నీవూను. అడుగు బావా ఏం చేశాడో?" అడి గినదానికి ఏడుస్తూ శంకరం చెప్పిన సారాంశం ఇది—

వాడి సావాసగాళ్ళంతాసినిమాకు వెళ్తుంటే వాడికీ సినిమాకు వెళ్ళా లన్పించిందట. అమ్మని డబ్బులడి గితే పైసా లేదని నెత్తి మొత్తు

కుందట. తెగించి, వాళ్ళతో ఎలాగైనా సినిమాకు వెళ్ళాలని హాలు పిట్టగోడ దొంగతనంగా తను దాటుతుంటే కావలాదారు చూసి వాణ్ని చావకొట్టేట్ట! కొడుతున్న సమయంలో మామయ్య హఠాత్తుగా వచ్చి విడిపించేట్ట!

"ఛీ, ఛీ! వెధవలు. పుట్టిన వాళ్ళంతా ఒక్కలాగే వున్నారు. పెద్దదేమో పిగ్గుతో ఈ వూరు మరి రానంటూంది. అక్కడే వాడితోనే వస్తుందట! వెళ్ళి పొమ్మంది. రెండోవాడు బడాచోర్! పదేళ్ళప్పుడు పారిపోయి ఎక్కడున్నాడో ఏమో, ఎవరికీ తెలీదు. ఆఖరువాడి సంగతి ఇది వీడికి చదువూ లేదు. తిండీ లేదు" అని అనవలసిన నాలుగు ముక్కలూ అనేసి ఆ వర్షంలో తడుచుకుంటూ మళ్ళీ ఎక్కడికో వెళ్ళిపోయాడు రాజ్యం తమ్ముడు.

రాస్తూన్న వుత్తరాన్ని పూర్తి చేస్తున్నాడు—

"నాజీవితంనాకుహాయిగావుంది. తీరిన కోరికలా వుంది. ఇంత కన్నా, ఈ సౌఖ్యం కన్నా ఇంకేం కోరుకోను దేవుణ్ణి! వుంటాను! వుత్తరం రాయి.

నీ జోగారావు."

వుత్తరాన్ని మడిచాడు అతను.

* * *

"అత్తగార్ని ఆసుపత్రికి తీసుకుని వెళ్ళాలి. రెండ్రూపాయలుండాలి. ఇంట్లోకి కిలో బియ్యం మాత్రమే వున్నాయి. బియ్యం కొనాలి. అమ్మాయి వోణీ కొనమని ఒకటే పోరు పెడుతోంది. ఇంకా ఆ వయసు దాటికి కొనకుండా వుంటే చూసేవాళ్ళకి బాగోదు. క్షణం క్రిందటే కిరణ కొట్టు షావుకారి వచ్చాడు అప్పులో కాస్తంతయినా తీర్చమంటున్నాడు...." ఆ విధంగా కాకిగోల చేస్తూన్న భార్యకి 'వూరుకో ముండ!' అని కేకేసి గసిరేడు సీతాపతి. అతనికి చాలా విసుగ్గా వుంది—సంసారం, పిల్లలూ, భార్య అంటేనే. క్షణం అందులోంచి విముక్తి కావాలని కోరుకుంటూ జోగారావుకి వుత్తరం రాద్దామని కూర్చున్నాడు.

ఇలా వ్రాయటం ప్రారంభించాడు.

"ఇక్కడ అంతా క్షేమం...." *

Published by K. Rajendra Babu, 80. Dhanalaxmi Colony, Madras - 600 026., and Printed by Sri Vijaya Bapineedu at Vijaya Graphics, 8, Arcot Road, Madras-600 026. Phone : 422233
Editor: VIJAYA BAPINEEDU.